# భాస్కర-మొల్ల రామాయణాలలో

# అవాల్మీకాలు - పరిశీలన



నిష్ఠల వేంకటనరసింహ అవధాన్లు భుక్త

## సంస్కృత వాఙ్మయమున ఆదికావ్యం
## రామాయణం - వాల్మీకి విరచితం

ఆంధ్ర వాఙ్మయమున మొదటి చంపూ రామాయణం, భాస్కర రామాయణం. అతడా? ఇతడా? - అదా? ఇదా? - అక్కడా? ఇక్కడా? - అప్పుడా? ఇప్పుడా? - అందుకా? ఇందుకా? - అలాగా? ఇలాగా? - అవునా? కాదా? - అనే ప్రశ్నలు వాటికి సమాధానాలు, చర్చలు, ఇవన్నీ ఒక ప్రక్కపెట్టి ముందుకు పోప్రయత్నిస్తే ఇప్పుడు లభ్యమగుచున్న ఆంధ్ర సాహిత్యములో ఉన్న రామ కథలన్నిటిలో మొదటిది రంగనాథ రామాయణము, రెండవది భాస్కర రామాయణము. దీనిని హుళక్కి భాస్కర బృందం వారు రచించి సాహిణిమారున కంకితమిచ్చిరి. భాస్కర రామాయణ రచన సుమారు క్రీ.శ॥1290-1310 మధ్యకాలంలో జరిగినట్లూహించవచ్చు.

ఇయ్యది నలుగురు రచయితలచే రచించబడింది. వారలు

1. హుళక్కి భాస్కరుడు 2. భాస్కరుని పుత్రుడు మల్లికార్జున భట్టు
3. నిశ్శంక వీరమారయ కుమారుడు కుమార రుద్రదేవుడు
4. అయ్యలార్యుడు. ఇందులో

| | |
|---|---|
| బాలకాండము | 785 గద్య పద్యములు కలది. |
| కిష్కింధాకాండము | 832 గద్య పద్యములు కలది. |
| సుందరకాండము | 573 గద్య పద్యములు కలది. |
| | 2190 మొత్తం గద్య పద్యములు. |

అష్టభాషాకవి మిత్రుడు భాస్కరసత్కవి పుత్రుడు మల్లికార్జునభట్టు వ్రాసేడు.

అయోధ్య కాండము 455 గద్య పద్యములు కలవి. సకల కళా విశారధుడు, శారదా ముఖ ముకురాయ మాణుడు, సారస్వత భట్టుబాణుడు నిశ్శంక వీరమారయ కుమారుడు భాస్కరుని శిష్యుడు కుమార రుద్రదేవుడు రచించేడు.

| | | |
|---|---|---|
| అరణ్యకాండము | 784 | గద్య పద్యములు కలది. (రెండాశ్వాసాలు) |
| యుద్ధకాండము | 1140 | గద్య పద్యముల వరకు |
| | 1924 | |

(యుద్ధకాండములో కొంత మంది లెక్క ప్రకారం 1134 గద్య పద్యములు) సకల సుకవి జన వినతుడు-యశస్కరుడు భాస్కరుడు (అరణ్య కాండములో) హుళక్కి భాస్కరుడు (యుద్ధ కాండములో) రచించేడు.

యుద్ధకాండము 1546 గద్య పద్యములు (కొందరి మతము ప్రకారము 1553) "శ్రీశాకల్య మల్లకవి రవిరాహువీర నరసింహోవర జాప్పులార్య నందనోభయ భాషా కవితా విశారద శారదా చరణ కమల పరిచయ పరీక్షమానసాయ్యలార్య విరచితంబైన శ్రీరామాయణ మహాకావ్యంబు నందు యుద్ధకాండ విశేషంబు సర్వంబు నేకాశ్వాసము". యీ విధంగా భాస్కర రామాయణము వ్రాయబడినది.

యీ భాస్కర రామాయణము నల్గురు కవులచే రచించబడినది - అయితే యీ నలుగురు కవులచే ఏక కాలమందు వ్రాయబడినట్లు ఊహించుకోవచ్చు. అయితే వివిధ శైలులలో అక్కడక్కడ కనుపించే కొన్ని పునరుక్తులను ప్రక్షిప్తాలుగా భావిస్తే సరిపోతుంది.

భాస్కర రామాయణము స్వతంత్రానువాదము. యిందు కొన్ని అవాల్మీకములున్నను మూలకథనల్లే ఉంచి అనువదించిరి. ఆధ్యాత్మిక రామాయణములోని కొన్ని కథాంశములు, ప్రజల వాడుకలోనున్న రామ కథాంశములు కొన్ని యిందు ప్రవేశపెట్టిరి.

**(వీరి) భాస్కర రామాయణమందలి కొన్ని అవాల్మీకములు :**

1. వాల్మీకి రామాయణమునందు రామాదుల జన్మతిథి, నక్షత్రములు మాత్రమే చెప్పబడినవి. కాని యిందు మూలమున లేని వారములు కూడా చెప్పబడినవి,

రాముడు - బుధవారం, భరతుడు - గురువారం, లక్ష్మణ శత్రుఘ్నులు - శుక్రవారం. రాముడు బుధవారం పునర్వసు నక్షత్ర కర్కటలగ్నమందు, 5 గ్రహములుచ్చస్థానమందుండగా గురు చంద్రులు కర్కటమందుండగా జన్మించెను, భరతుడు దశమీ గురువారం మీనలగ్నమందున, లక్ష్మణ శత్రుఘ్నులు కర్కటలగ్న ఆశ్లేషా నక్షత్ర శుక్రవారమని చెప్పబడియున్నది. కాని వాల్మీకి రామాయణమందు రాముడు చైత్రమాసమందు, నవమీ తిథియందు, పునర్వసు నక్షత్రమందు సూర్యాంగారక, శని, బృహస్పతి, శుక్రులైదుగురును

తమతమ యుచ్ఛస్థానము లందుండగా, బృహస్పతి చంద్రునితో కర్కటమందుండగా కర్కటలగ్నమందు జన్మించెననియు, భరతుడు పుష్యమీ నక్షత్ర మీనలగ్నమందునను, లక్ష్మణ శత్రుఘ్నులు ఆశ్లేషా నక్షత్ర కర్కటలగ్నమందునూ జన్మించిరనియున్నది.

2. వాల్మీకి రామాయణమున గౌతముడు అహల్యను వాయుభక్షణ చేయుచు నిరాహార భస్మశాయినియై ఎవరికి కానరాకుండు నటుల శపించెను.

శ్లో॥ వాయుభక్షా నిరాహారాతప్యంతీ భస్మశాయినీ
అదృశ్యా సర్వభూతానామా శ్రమేస్మిన్నివత్సుసి (వా.రా.బా.కా. సర్గ 48.30)

కాని భాస్కర రామాయణమున పాషాణంబై యుండునట్లు శపించెను. ఆధ్యాత్మ రామాయణమున యిట్లు ఉన్నది. ఇది జనవ్యవహారమున నాతిని రాతిని చేసినట్లు ప్రచారము.

3. వాల్మీకి రామాయణమున రామ పట్టాభిషేకభంగ మొనర్చుటకు మంథర కేవలము పాపదర్శినియని మాత్రమే చెప్పెను.

శ్లో॥ సాదహ్యమానా కోపేన మన్థరా పాపదర్శినీ
శయ్యా మేతక్తైకేయీ మిదం వచన మబ్రవీత్॥

కాని భాస్కరాదులు రాముడు చిన్న తనమందెపుడో మంథరను కాలితో తన్నుటచే వైరకారణముగా గొని కైకకు దుర్బోధగావించెనని వ్రాసిరి.

4. వనమున కరిగినపుడు శృంగభేరి పురమున సీతారాములు నిద్రించు చుండగా, లక్ష్మణుడు పదునాల్గేండ్లు నిద్ర మాని రాముని సేవింతునని గుహునితో తన ప్రతిజ్ఞ తెలిపినట్లు భాస్కర రామాయణమున కలదు. కాని మూలమున లేదు.

5. అయోధ్య కాండమున ధశరథుడు కౌసల్యతో పూర్వము తాను ముని బాలకుని చంపిన వృత్తాంతము చెప్పు సందర్భమున బాణహతుడైన ముని కుమారుడు "హా నమః శివాయ" యను నెలంగు అని భాస్కర రామాయణమున నున్నది. కాని యది వాల్మీకి రామాయణమందిట్లున్నది. "హా హేతి పతితస్తోయే బాణాభిహత మర్మణః" యిది యీ కవుల యద్వైత మతమును వ్యక్తము చేయుచున్నది.

6. అరణ్య కాండమున లక్ష్మణుడు జంబు కుమారుని వధించినట్లును యీ జంబు కుమారుడు శూర్పణఖ కొడుకనియు భాస్కర రామాయణమున కలదు. కాని వాల్మీకి రామాయణమున యిదిలేదు.

7. కిష్కింధ కాండమున వాలి వధానంతరము వాలి భార్యతార రాముని శపించినట్లు

చ॥ నరవర యిట్లకారణమునా పతి జంపితింగానయీ బం
ధురభుజ శక్తితో మహిజఁ దోకొని వచ్చిన సీత నీకడం
జిరతరకాలమింపుగవసింపక నీవతి దుఃఖ పాటుతో
వెరయచునుండ భూమిఁజొరనిమ్మనుచున్ శపియించె గిన్కతోన్.

భాస్కర రామాయణమున కలదు. వాల్మీకి రామాయణమున లేదు.

8. భాస్కర రామాయణమున సీతారామ లక్ష్మణులు ముగ్గురు నారచీరలు ధరించి వనమున కేగినట్లున్నది. కాని వాల్మీకి రామాయణమున రామలక్ష్మణులు మాత్రమే నారచీరలు ధరించి వనమునకేగి నట్లున్నది.

9. భాస్కర రామాయణములో అరణ్యకాండమందు రావణుడు పర్ణశాలలో తన అసలు రూపం (పది తలలు ఇరువది చేతులు) సీతకు చూపించే సరికి ఆమె మూర్ఛపోయి నేలమీద పడిపోతుంది అపుడు రావణుడు సీతను పొదివి పట్టి రథంబుపై పెట్టి లంకాభిముఖుడై గగన గమనంబున చనియె, అని ఉంది. కాని వాల్మీకి రామాయణములో

శ్లో॥ జగ్రాహ రావణస్సీతాం బుధః ఖేరోహిణీ మివ
వామేన సీతాం పద్మాక్షీం మూర్ధజేషు కరేణసః
ఊర్వోస్తు దక్షిణేనైవ పరిజగ్రాహపాణినా

ఆ రావణుడు సీతా దేహము తనమేనికి దగులకుండునట్లు వామ హస్తంబున వెంట్రుకలను కుడిచేత తొడలంబట్టు కొని బరుష వచనముల నామెను బెదరించుచు ఎత్తి తన రథముపై గూర్చుండ బెట్టెను, అని యున్నది.

10. భాస్కర రామాయణములో రావణుడు (అరణ్య కాండములో) తనకు అడ్డు వచ్చిన జటాయువును నేల కూల్చి సీతను తీసుకొని పోవుచున్నప్పుడు బ్రహ్మ దివ్య దృష్టితో, చూచి "నాజారిచేటింక నిక్క మయ్యె ననుచు నిశ్చయించె" అన్నట్లుంది. కాని వాల్మీకి రామాయణమున బ్రహ్మ దివ్య దృష్టిం జూచి (కార్యంబైనది) కృతం కార్యమితి"

శ్లో॥ దృష్ట్వా సీతాం పరామృష్టాం దీనాం దివ్యేన చక్షుషా
కృతం కార్యమితి శ్రీమాన్వ్యా జహార పితామహః॥ అని యున్నది.

11. భాస్కర రామాయణమున (కిష్కింధ కాండములో) సంపాతి తన కుమారుడగు సుపార్శ్వుని లంకకు పోయి సీతను కనుగొని రమ్మని పంపించి నట్లున్నది. వాల్మీకి రామాయణమున లేదు.

12. భాస్కర రామాయణమున అయోధ్య కాండమున చిత్రకూట మందు రాముని కలసిన భరతుడు రామునాజ్ఞను సారము అయోధ్యకు మరలుటకు రాజ్య పరిపాలనకై రాముని పాదుకలు భరతునకిమ్మన వసిష్టుడు రామునితో చెప్తాడు. "భరతుడు నిన్ను భక్తి యుక్తులతో ప్రార్థిస్తున్నాడు. భక్తవత్సలుడవైన నీవు మేదినీ భరము భరింప నీ తొడుగు పాదుకలా నతియిమ్ము" నపుడున్ గురు వచనంబు మీరక రఘుప్రవరుండటుసేసి –అని యున్నది. కాని వాల్మీకి రామాయణములో భరతుడు తాను తెచ్చిన బంగారు పాదుకలపై రాముని పాదాలుంచ ప్రార్థించగా రాముడట్లు చేయును. భరతుడా పాదుకలను కనుల కద్దుకొని తీసుకొని వెళతాడు.

శ్లో॥ అధిరోహార్య పాదాభ్యా పాదుకే హేమభూషితే
ఏతేహి సర్వలోకస్య యోగక్షేమం విధాస్యతః
సోధిరుహ్యా నరవ్యాఘ్రః పాదుకే హ్యవరుహ్యాచ
సాపాదుకే సంప్రణమ్య రామం వచన మబ్రవీత్.

13. భాస్కర రామాయణమునందు సముద్ర లంఘమునకు పూర్వము హనుమంతుడు నిజ జనన వృత్తాంతము తానే చెప్పినట్లున్నది. కాని వాల్మీకి రామాయణమున జాంబవంతుడు చెప్పినట్లున్నది.

14. భాస్కర రామాయణములో హనుమంతుడు లంకా దహనంచేసి తోక ఆర్పుకొని క్షేమంగా తిరిగి సీతను చూడాలనుకొని ఆమె దగ్గరకు వెళతాడు. అంత వరకు ఆమె అతని యోగ క్షేమానికై చింతిస్తూంటుంది. క్షేమంగా తిరిగి వచ్చిన హనుమంతుని చూసి ఆ అగ్నికి చిక్కకుండా క్షేమంగా ఉన్నావు కదా నువ్వున్నంతసేపూ యీ దుఃఖము మరచిపోయి ఉంటున్నాను నీవు లంక విడిచి వెళ్లిపోతే మళ్లా దుఃఖానికి లోనవుతాను. కాబట్టి యీ వేళ మాని రేపు నీవు వెళ్ళి పోకూడదా? కనీసం యీ రోజైనా యీ దుఃఖం లేకుండా ఉంటానంటుంది. సీత యీలా చెప్పడం అవాల్మీకం.

15. వాల్మీకి రామాయణములో (సుందరకాండము) రావణుడు సీతను అశోక వనంలో చూసి ఆమెతో 'రెండు నెలల పైని నన్ను నీవు భర్తగా అంగీకరించకపోతే నా

ప్రాతఃకాలభోజనానికి మావంటవాళ్లు నిన్ను ముక్కలుగా నరుకుతారంటాడు.

శ్లో॥ ద్వా భ్యా మూర్ధ్వంతు మాసాభ్యాం భర్తారం మమనీచ్ఛతీమ్
మమత్వా ప్రాత రాశార్థే సూదాః ఛేత్స్యంతి ఖండశః

కాని భాస్కర రామాయణములో రావణుడు సీతతో యిట్లంటాడు. "నన్నెంతో అవమానంగా పలికిన నిన్ను ఇప్పుడు చంపగలను. కాని నువ్వు రెణ్ణెల్ల పై నినన్నొల్లక పోతే నిన్ను నరుకుతాను. అని కాపలా ఉన్న రాక్షస స్త్రీలను చూసి మీరు సీతను బుజ్జగించియైనా, బోధించియైనా, భయపెట్టియైనా రెణ్ణెల్లలో నాకు అధీనగా చేయండి. అలాకాకుంటే రాక్షసులందరు చక్కగా తినండి.

క॥ రెణ్ణెల్లలోన నాకు జెన్నొందన దీనగాగ జేయుడు మరికా
కున్న నిశాచరులందరు గ్రన్న నజక్కాడి తినుండు ఘనపలలంబున్

ఇక్కడ రావణుడు తానే తింటానన్న కన్న రాక్షసులను తినమని చెప్పడంలోనే రాచఠీవి ఉంది. హుందా ఉంది. అందుకేనేమో మల్లికార్జున భట్టు అలా రావణుని చేత చెప్పించేడు.

16. వాల్మీకి రామాయణము సుందర కాండమునందు రావణుడు అశోకవన మందున్న సీత వద్దకు వచ్చి తన్ను వరించి సుఖించమని ఆమెతో చెప్పగా ఆమె అతనిని తూలనాడును. అప్పుడు ధాన్యమాలిని రావణునితో "ప్రేమ కలవాడు ప్రేమ లేని దానిని వరిస్తే శరీరం తపిస్తుంది. అదే ప్రేమ గల స్త్రీతో అయితే సంతోషం కలుగుతుంది.

శ్లో॥ అకామాం కామయానస్య శరీరము పతప్యతె
ఇచ్ఛంతీ కామయానస్య ప్రీతిర్భవతి శోభనా అని అంటుంది.

అప్పుడా రావణుడు మేఘము గర్జించినట్లు నవ్వుచు మరలెను. అట్లు బయలు దేరిన రావణుడు భూమి యదురునట్లు అడుగులువేయుచు తన భవనమున ప్రవేశించెను.

శ్లో॥ ఏవముక్తస్తు రాక్షస్యా సముత్క్షిప్తస్తతో బలీ
ప్రహసన్మేఘసంకాశో రాక్షసస్సన్య వర్తత
ప్రస్థితస్స దశగ్రీవః కంపయన్నివమేదినీమ్
జ్వలద్భాస్కర వర్ణాభం ప్రవివేశ నివేశనమ్

వాల్మీకి రామయణములో యిలాగ ఉంటే భాస్కర రామాయణములో ధాన్యమాలి అలా అనగా నవ్వి ఆమెతో కేళికా మందిరానికి వెళ్లినట్లుంది.

క॥ అనవిని యల్లననవ్వుచు మనసిజ
సాయకభిన్న మానసుడైయా
వనితయుదానును మగుడంజనె
దశకంఠుడు గేళికా సదనంబునకున్

అయితే యీ విషయము వాల్మీకి రామాయణమున హనుమంతుడు (చెట్టు పైనుండి చూచును) తిరిగి సముద్రము దాటివచ్చి వానరులను కలసినపుడు వారలకు చెప్పును. కాని భాస్కర రామాయణమునందు వానరులకు చెప్పినటుల లేదు.

17. నలుడు సేతువు కట్ట ప్రారంభించి నపుడు కార్యము నిర్విఘ్నముగా పూర్తియగుటకు వినాయకస్తుతి చేసినట్లు భాస్కర రామాయణ మందు కలదు.

శా॥ విఘ్నేశాయనమో నమో భగవతే వేదండతుండాయని
ర్విఘ్న క్షేమకృతే నమోస్తు భవతేవిశ్వ ప్రభోయంచు గ్రేం
చఘ్న జేష్ఠు బ్రసన్నుం జేసి నలుడుత్సాహంముతో సద్భు తో
పఘ్న ధ్యా నము గాగనొక్క నగ మెప్పన్ వైచనంబోనిధిన్

ప్రతి కార్యారంభమందు వినాయక పూజ చేయుట తెలుగువారి యాచారము. దీనినే భాస్కరాదులు యిచ్చట ప్రవేశపెట్టిరి. యిది వాల్మీకి రామాయణమున లేదు.

18. వాల్మీకి రామాయణములో యుద్ధకాండమందు విభీషణుడు రావణునికి హితోక్తులు చెబుతూ సీతను రామునకిచ్చి శరణు వేడుమని మూడు మార్లు చెపుతాడు. కాని అతనిమాట వినక రావణుడు "నీవు తమ్ముడవు కాబట్టి బ్రతికి పోయేవు మరొకడైతే యీ పాటికి చచ్చి పోయేవాడు" అనగా వెంటనే విభీషణుడు గదపుచ్చుకొని మరొక నలుగురు రాక్షసులతో పైకెగసి అన్నకు నమస్కరించి "రాక్షసులను నిన్ను కాపాడుకో నీకు శుభమగు గాక అని గగన మార్గాన రాముని వద్దకు పోయి శరణు వేడుతాడు. కాని భాస్కర రామాయణములో రావణుడు విభీషణుని మాటలకు కోపించి కత్తి తీసి విభీషణుని చంపుతానని అతని పైకి వెళ్ళ ప్రహస్తు ప్రముఖులు వారిస్తారు. అప్పుడు రావణుడు ప్రహస్తుని జూచి విభీషణుని కొలువునుండి వెడలగొట్ట మనగా ప్రహస్తుడు విభీషణునిట నుంచి వెడలిపొమ్మంటాడు. అప్పుడు విభీషణుడు నలుగురు మంత్రులను తీసుకొని తల్లియైన కైకశి వద్దకు పోయి జరిగిన దంతయు చెప్పగా ఆమె అతనిని రాము నొద్దకు బోయి శరణు వేడుకొమ్మంటుంది. అంత విభీషణుడు గగన మార్గమను రామునొద్దకు

బోయి శరణు వేడుకుంటాడు. విభీషణుడు యీ విధముగా తల్లియొద్దకు బోవుట ఆమె అతనిని రామునొద్దకు బోయి శరణు వేడమనుట అవాల్మీకము.

19. వాల్మీకి రామాయణమున రావణుని పరుష వాక్యములకు న్యాయము పలుకు విభీషణుడు గదచేత బూని నలుగురు రాక్షసులతో పైకెగరి గగన మార్గమున రామునొద్దకు బోయి అతనిని శరణువేడుకొంటాడు. అట్లు శరణాగతుడైన విభీషణునికి రాముడు అభయమిచ్చి వానిని నాడే రాక్షస రాజుగా అభిషిక్తుని చేస్తాడు. అలా రాక్షస రాజ్యమునకు (లంకారాజ్యమునకు) విభీషణుని అభిషిక్తుని గావించిన రామచంద్రుని చూసి సుగ్రీవుడు రామచంద్రా యిపుడు రావణుడు నిన్ను శరణవేడితే ఏమి చేస్తావు? అని ప్రశ్నిస్తాడు.

చ॥ అనఘ చరిత్ర మీకు శరణాగత రక్షకుల వ్రతంబుమీ
సునిశిత బాణ జాలములకున కోర్వక వచ్చితా దశా
ననుడభయంబు వేడికొని నందగ నెల్లగునన్న నవ్వి భుం
డిన జనుతుజూచి యట్లయిన నిచ్చెద నానికయోధ్య నావుడన్

అప్పుడు రాముడు అలా రావణుడే శరణు కోరితే అయోధ్యను అతనికి యిస్తానంటాడు. (లంకను విభీషణునికి యిచ్చేడుగాబట్టి). యిలా సుగ్రీవుడు రాముని ప్రశ్నించటం దానికి రాముడు యీ విధమైన సమాధానం చెప్పటం అవాల్మీకం అయినా రాముని శరణాగత వత్సలతకు యిది ఒక గొప్ప ఉదాహరణ. భాస్కరుని పాత్ర పోషణా విధానానికి యిదొక చక్కని మచ్చుతునక.

20. వాల్మీకి రామాయణమందు యుద్ధ కాండములో రాముడు వానర సైన్యంతో సముద్రపుటొడ్డున విడిది చేయగా చూసి రావణుడు సభయేర్పాటు చేసి కర్తవ్యం ఆలోచించమని సభికులకు చెప్తాడు. అప్పుడు కుంభకర్ణుడు రావణునితో సీతను తేవటం తొందర పాటుపని అని అయినా నీవు అన్నవు కనుక నీకు అండగా ఉండి శత్రు సంహారం చేస్తానని ఉండగా, భాస్కర రామాయణములో కుంభకర్ణుడు రావణునితో ఆది మధ్యాంతరహితుడై నట్టి విష్ణువు అసురకుల వధార్థము రాముడుగా పుట్టేడు రామచంద్రుడు సామాన్య నరుడుగాడు ఈ విధమున నారదుచే వింటిని కాన సీతను మరల భూవిభునకు నర్పింపు సుఖావహమయ్యెడు మనకు అని అంటాడు అప్పుడు రావణుడు కోపంగా ఉండటం చూసి ఇవన్నీ యెందుకులే యుద్ధంలో రాఘవులను వధిస్తాను, సుగ్రీవాదులను భ్రమింగుతాను అంటాడు.

21. భాస్కర రామాయణమున సీత హనుమంతునకు కాకాసుర వృత్తాంతము చెప్పును (ఆ కాకాసురుడు ఇంద్రుని కొడుకని చెప్పును) లంక నుండి తిరిగి వచ్చిన హనుమంతుడు రామునికి సర్వము చెప్పెనే కాని కాకాసుర వృత్తాంతము చెప్పలేదు. వాల్మీకి రామాయణమున కాకాసుర వృత్తాంతము రెండు సార్లు చెప్పబడినది.

22. భాస్కర రామాయణమున యుద్ధ కాండమునందు సేతు బంధన కాలమున సముద్రుడు రాముని విష్ణువని పొగడును. యిది అవాల్మీకము.

23. భాస్కర రామాయణ యుద్ధ కాండమందు రావణ శక్తిచే లక్ష్మణుడు మూర్ఛితుడు కాగా హనుమంతుడు సంజీవి తెచ్చు సందర్భమున త్రోవలో ముని వేషమున నున్న మారీచు, పుత్రుడు కాలనేమి యాశ్రమము గాంచుట అందలి సరస్సు క్రుంకబోయి అందు మొసలియై యున్న ధాన్యమాలికి శాప విముక్తిఁ గావించుట తరువాత కాలనేమిని సంహరించుట కలదు. వాల్మీకి రామాయణము నందు యిది లేదు. అటులనే హనుమంతుడు రెండవ మారు సంజీవి పర్వతమును తెచ్చునపుడు అతనిని భరతుడుచూచుట, సంజీవితెచ్చు చున్న హనుమంతునితో మాల్యవంతుడు యుద్ధముచేయుట మొదలగు అవాల్మీకములు భాస్కర రామాయణ మందు కలవు.

24. వాల్మీకి రామాయణమందు లేని శుక్రుని ఉపదేశమున రావణుడు పాతాళహోమము చేయుట భాస్కర రామాయణమందు కలదు. అటులనే మండోదరి రావణునకు రామ మహిమ చెప్పుట అంగదుడు మండోదరిని ఈడ్చుకొని రావణుడు హోమముచేయు స్థలమునకు వచ్చుట భాస్కర రామాయణమందు కలవు.

25. భాస్కర రామాయణమందు యుద్ధ కాండములో నాగపాశబద్ధులైన రామలక్ష్మణుల వద్దకు నారదుడు వచ్చి శ్రీరామునుతించి నీవే యాది విష్ణువని చెప్పినట్లున్నది. కాని వాల్మీకి రామాయణమున నారదుడు వచ్చుట, రాముని నీవే విష్ణువని చెప్పుట లేదు. రావణవధ యగు వరకు రాముని యెవ్వరూ ప్రత్యక్షముగా అతడు భగవంతుడని చెప్పుటగాని లేదు. ఇట్లు రాముని ప్రత్యక్షముగా అతనే దేవుడని (రావణ వధవరకు) ఏవైనను చెప్పుట వాల్మీకి మతము గాదు.

సీ॥ మహనీయకాంచన మౌంజిసమేతమై జిగిజెల్వమగు మృగాజినము తోడ
బరిలిప్త పాండురభసితతర జోధూళితములైన బ్రహ్మ సూత్రములు వెలయ
గరనఖ చంద్రికా కలితమై నిర్మల స్ఫటికాక్ష మాలిక ప్రజ్వరిల్ల

బుణ్య తీర్థోక పూర్ణమై దీప్తి మండలి బొల్చు మణిక మండలవు వెలుగ
ఒల్ల జడల కెంపు బాలార్కరుచి పెంపు గడవ రామచంద్రు కడకు వచ్చె
రమ్యకాంతి జిత శరన్నీరదుండు వీణా విశారదుండు నారదుండు

యీ నారదుడు నూటికి నూరపాళ్లు శైవుడే. అవాల్మీకమైనా చక్కని వర్ణన.

26. భాస్కర రామాయణమందు యుద్ధకాండములో రావణ వధాఘట్ట మందు రాముడు రావణుని కరశిరము రెన్నిమారులు త్రుంచినను అవి మరల బుట్టుచుండును. అప్పుడు విభీషణుడు రామునితో రావణుని నాభి యందు అమృతమున్నదనియు ఆగ్నేయాస్త్రముచే ఆయమృతమింక చేయుమని రాముడట్లు చేసి రావణుని వధించును. యిందు రాముడు రావణుని తలలను నూట తొమ్మిది మార్లు త్రుంచినట్లున్నది. కాని వాల్మీకి రామాయణమున రాముడు నూరుమార్లు రావణుని తలలు త్రుంచగా అవి మరల బుట్టుటచే మాతలి రామునకు బ్రహ్మాస్త్రము పయోగింపమనగా రాముడు రావణునిపై బ్రహ్మాస్త్రము ప్రయోగించి (నూట ఒకటవమారు) వధించును.

27. భాస్కర రామాయణము యుద్ధ కాండములో రావణుడు మొదటి సారి రామునిచే పరాజితఖిన్న మానసుడై కొలువు దీరి రాక్షసుల నవలోకించి "మునుపు బ్రహ్మను సురాసుర గంధర్వ యక్షసిద్ధ విద్యాధరులచే భయములేకుండా వరం కోరినాను కాని నరవానరులను లెక్కగాన లేదు అందుచే యీనాడు యిలా జరిగింది. "మనలను గెలిచిన దశగ్రీవుడు కుద్ర నరవానరులకు ఓడిపోయినాడు" అని దిక్పాలకులు నవ్వునటుల నేచేసిన తపస్సు బూడిదలో కలసిపోయింది. ఏమి చెప్పేది. వెళ్ళి కుంభకర్ణుని మేలుకొలపండి అంటాడు. యిక్కడ పుంజి కస్థల కథకాని పార్వతీ నందీశ్వరుడు మొదలగు మిగతా వారల శాపం గురించి చెప్పడు. కాని వాల్మీకి రామాయణమున యుద్ధ కాండము 60వ సర్గ యందు రావణుడు యుద్ధమున రామబాణ తీవ్రతకు తాళలేక కుంభకర్ణుని మేల్కొలుప రాక్షసులను బంపుటకై రాక్షసులను కొలువునకు రప్పించి వారలతో యిట్లనె "నేను చేసిన మహా తపస్సంతయు విఫలమైనది. దేవేంద్ర సమానుడగు నేనొక మానవున కోడితిని మున్ను బ్రహ్మనాతో పలికిన భయంకర వచన మిపుడు తటస్థించినది "నీకు మానవుని వల్లనే భయమున్నదని తెలిసికొమ్ము" ఆయన వచనము సత్యమైనది.

శ్లో॥ ఇదం తద్బ్రహ్మణో ఘోరం వాక్యం మామభ్యుపస్థితమ్
మానుషేభ్యో విజానీహి భయంత్వ మితి తత్త దా.

నేను బ్రహ్మ వద్ద దేవ, దానవ, గంధర్వ, యక్ష, రాక్షస పన్నగుల వలన మరణము కలుగకుండునట్లు వరము పొందితిని. కాని మానవుని వలన మరణము కలుగకుండునట్లు వరము కోరలేదు – పూర్వమిక్ష్వాకు వంశజుడగు అనరణ్యుని నేను వేధించు నపుడు రాక్షసాధమా ! నా వంశమునొక మహా పురుషుడు పుట్టగలడు. అతడు నిన్ను, నీ పుత్రులు, సైన్యము, అశ్వములు సారథితో సహా యుద్ధమున సంహరింపగలడని పలికెను. ఆ మనుజుడే యీ రాముడని తెలిసినది. పూర్వము నేను వేదవతిని బలాత్కారముచేయగా ఆమె నన్ను శపించినది. ఆమెయే యీ జనకుని కూతురగు సీతగా జన్మించినది. పార్వతియు నందీశ్వరుడును, రంభయు, వరుణ కన్యకయగు పుంజికస్థలయు తమతమ ప్రభావముచే తాము పూర్వమిటుల చెప్పిరో అట్లే జరిగినది. ఋషి భాషితము అసత్యముగానేరదు.

శ్లో॥ ఉమా నందీశ్వరశ్చా పిరంభావరుణ కన్యకా
యథోక్తా స్తప సాప్రాప్తం నమిథ్యా ఋషి భాషితమ్.

పుంజిక స్థలను చెరచినందులకు బ్రహ్మ యిచ్చిన శాపం (వాల్మీకి రామాయణము యుద్ధకాండము 13వ సర్గ)

శ్లో॥ అద్య ప్రభృతియా మన్యాంబలాన్నారీంగమిష్యసి
తదాతే శతధా మూర్ధా ఫలిష్యతి నసంశయ.

కాని భాస్కర రామాయణమందు బ్రహ్మ యిట్లు శపించినట్లున్నది.

"నన్యలలనఁ బల్మిం బట్టు కొనిన
ష్ట శిరంములు వ్రయ్యలై పడన్"

28. భాస్కర రామాయణమునందు కిష్కింధకాండమున సీత కోసమై దక్షిణ దిక్కంతా వెతకి ఆమె ఎక్కడ కనుపించక ప్రాయోపవిష్టులై చింతిల్లుచున్న ఆవానరులు యిలా అనుకుంటారు.

క॥ ఇలభరతు నేలింపగ ఖల బుద్ధిం బాపజాతి కైకేయి వరం
బులు వేడి విభుని రాఘవకులముం గపికులముఁ బక్షికులముంజెరిచెన్.

"ఒక్కడిని కాదు చుట్టేడుగురిని (అంతమందినీ చుట్ట బెట్టింది ఆ కైక పాపపు కోరిక" మంచి చమత్కారము, సందర్భోచితము సహజముగా ఉండి సాగిందీ పద్యము. వాల్మీకి